త్యాగానికి ప్రతీక బక్రీద్

జిల్లా వ్యాప్తంగా ముస్లింలు త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

\- సాక్షి నెట్‌వర్క్


మరిపెడ: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


గార్ల: ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు


బయ్యారంలో..


దోర్నకల్‌లో..


కురవిలో..


కేసముద్రం: ఇనుగుర్తిలో..


తొర్రూరులో..


నెల్లికుదురు: మండల కేంద్రంలో..


నర్సింహులపేట: వేడుకల్లో ముస్లింలు


గూడూరులో..

క్లుప్తంగా

పాఠశాలకు బెంచీల వితరణ


బెంచీలు అందజేసిన ప్రిన్సిపాల్ రమేశ్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: సమాజానికి ఏదైనా చేయాలనుకుంటే ఒక పాఠశాల అభివృద్ధితోనే సాధ్యమవుతుందని ఏకశిలా ఏంజిల్స్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేశ్ రెడ్డి అన్నారు. ఏకశిలా విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి సహకారంతో మండలంలోని మాధవాపురం ప్రాథమిక పాఠశాలకు రమేశ్ రెడ్డి రూ.80వేల విలువైన విద్యార్థులు కూర్చునే బెంచీలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరన్న, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సీఆర్పీ లింగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్ జూడ్, స్వరూప పాల్గొన్నారు.

ఆలయ ఆర్చ్ ప్రారంభం


ఆర్చ్‌ను ప్రారంభిస్తున్న దాత రాజయ్య

గార్ల: గార్లలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం ఎదురుగా దాత పుల్లఖండం రాజయ్య నూతనంగా నిర్మించిన ఆర్చ్ (ప్రవేశ ద్వారం)ను శనివారం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రారంభించారు. తమ తల్లితండ్రుల జ్ఞాపకార్థం ఆర్చ్‌ను నిర్మించినట్లు దాత పేర్కొన్నారు. అనంతరం దేవాలయం ప్రాంగణంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు అచ్చుతాచార్యులు, పుల్లఖండం రమేష్‌బాబు, శ్రీనివాస్, కందునూరి ఉపేందర్, లక్ష్మణ్‌నాయక్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల విజ్ఞానయాత్రకు ఆహ్వానం

పెద్దవంగర: లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో ఐఐసీటీ హైదరాబాద్‌లో రైతులకు ఒకరోజు విజ్ఞాన యాత్ర, శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ ఆఫ్ మండల అధ్యక్షుడు సిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ సాగులో నూతన ఆధునిక శాస్త్రీయ పద్ధతులపై సమగ్ర శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈనెల 12న మండల కేంద్రం నుంచి వాహనం బయలుదేరి తిరుగు ప్రయాణంలో స్వర్ణగిరి దేవస్థాన దర్శనం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగి రైతులు తమ పేర్లను నమోదు చేసుకొనేందుకు 98481 70538 సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందుతాగి ఆత్మహత్య

నర్సింహులపేట: మండలంలోని జగ్గుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తతండాలో గుమ్మడవెల్లి బొందయ్య(70)అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. పెద్దనగారం గ్రామానికి చెందిన బొందయ్య కొంతకాలంగా కొత్తతండాలో నివాసం ఉంటున్నాడు. ఆరోగ్యం సరిగాలేక మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి పెద్ద కుమార్తె రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం ఘటనలో ఇద్దరి అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: తండ్రిపై హత్యాయత్నం జరిగిన ఘటనలో బాధితుడి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇద్దరిపై కేసు నమోదు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించామని రూరల్ ఎస్సై వి.దీపిక శనివారం తెలిపారు. మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామానికి చెందిన దిడ్డి గట్టయ్యపై ఆయన అల్లుడు నరేష్ గొడ్డలితో దాడిచేసి గాయపరిచి హత్యాయత్నం చేశాడని కుమార్తె శ్రావణి ఫిర్యాదు చేసింది. శ్రావణిని అదనపు కట్నం తీసుకురావాలని తన భర్త నరేష్ వేధిస్తున్నాడని, అదే గ్రామంలో తన తండ్రి పేరు మీద ఉన్న రెండు ఎకరాల భూమిని కూడా తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని తన తండ్రిని ఇబ్బంది పెడుతున్నాడని పేర్కొంది. ఈక్రమంలో పథకం ప్రకారం ఈనెల 4వ తేదీ రాత్రి గట్టయ్యను హత్య చేయాలనే ఉద్దేశంతో ఆయన ఇంటి మీదకు వచ్చి అల్లుడు పచ్చిపాల నరేష్, అతడి అన్న పచ్చిపాల లింగన్న ఇద్దరు కలిసి గొడ్డలి, ఇనుప రాడ్‌తో దాడిచేయటంతోపాటుగా శ్రావణి, ఆమె కుటుంబ సభ్యులపై కూడా దాడిచేసి గాయపరిచారు. పోలీసులు విచారణ చేపట్టి గట్టయ్య అల్లుడు పచ్చిపాల నరేష్, అతడి అన్న పచ్చిపాల లింగన్నను అరెస్ట్ చేసి, వారు నేరం చేయడానికి ఉపయోగించిన ఒక గొడ్డలి, ఒక ఇనుపరాడు, ఒక ద్విచక్రవాహనం , రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు

దోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సకల వసతులను ఉచితంగా కల్పిస్తుందని ఇన్‌చార్జ్ డీఈఓ రాజేశ్వర్ తెలిపారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామ జెడ్పీహెచ్ఎస్ పరిధిలో జరుగుతున్న బడిబాట కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. బడిబాట కార్యక్రమంలో 32 మంది పిల్లలను బడిలో చేర్పించడంపై పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఏసీజీఈ శ్రీరాములు, ఎగ్జామ్ బోర్డు అసిస్టెంట్ సెక్రెటరీ సతీష్, హెచ్ఎం విత్తనాల సుధాకర్, ఉపాధ్యాయులు శ్రీదేవి, విజయకుమారి, ప్రశాంతి, లక్ష్మినర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: సర్కారు బడిలోనే సకల సౌకర్యాలు ఉంటాయని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్ నాయక్ అన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలో పలు వార్డులో బడిబాట ప్రచారం శనివారం నిర్వహించారు.

మహబూబాబాద్ రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జి.ఉప్పలయ్య అన్నారు. బడిబాటలో భాగంగా మండలంలోని సికింద్రాబాద్ తండాజీపీలోని టేకులగూడెం, కంబాలపల్లిలో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి , సతీష్ కుమార్, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, యుంగేందర్, మంగీలాల్, సురేష్ పాల్గొన్నారు.


మహబూబాబాద్ అర్బన్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కబ్జాదారులపై చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న జడ సత్యనారాయణ

గార్ల: గార్ల పెద్దచెరువు శిఖం భూమిని ఆక్రమించుకొని దర్జాగా సాగుచేసుకుంటున్న కబ్జాదారులపై చర్య తీసుకోవాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జడ సత్యనారాయణ డిమాండ్ చేశాడు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెరువు శిఖం భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి, ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలన్నారు. కబ్జాదారులు చెరువు లోతట్టులో బావులు తీసి, బోర్లు వేసుకొని అక్రమంగా పంటలు సాగు చేసుకుంటున్నా, సంబంధిత అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జి సక్రు, మనోహర్, మాన్యా, యాకయ్య, సైదులు, వెంకన్న, వీరన్న, సురేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

గార్ల: రాష్ట్రంలో ప్రజా సమస్యలను విస్మరించిన పాలకులకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. శనివారం మద్దివంచ గ్రామంలో జరిగిన పార్టీ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బయ్యారంలో ఇనుప ఖనిజ సంపద ఉన్నందున ఈ ప్రాంతంలో ఐరన్ ఓర్ ఫ్యాక్టరీ నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. అనంతరం మద్దివంచ గ్రామశాఖ కార్యదర్శిగా జనార్దన్, సహాయ కార్యదర్శులుగా రాగం సత్యనారాయణ, గుగులోత్ భీమ్లా లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టిబోయిన శ్రీనివాసరావు, జంపాల వెంకన్న, రాగం రమేష్, భిక్షమయ్య, వెంకటేష్, వెంకన్న, పిచ్చయ్య, రాములు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయసారథి

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత


డోర్నకల్: ఆవులను పట్టుకున్న పోలీసులు

డోర్నకల్: డోర్నకల్ మీదుగా టాటా ఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఆవులను డోర్నకల్ పోలీసులు పట్టుకున్నారు. డోర్నకల్ ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున ఎస్సై గడ్డం ఉమ, కానిస్టేబుళ్ల సైదులు, హేమసుందర్‌రావు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గొల్లచర్ల వైపు నుంచి లింగాల వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో నాలుగు ఆవులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆటోలోని కురవి మండలం బలపాల శివారు లింబ్యాతండాకు చెందిన మాళోత్ రాజు, తేజావత్ సతీష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరపగా తాము బొడ్రాయితండాలో రెండు, తొడేళ్లగూడెంలో ఒకటి, బలపాలలో ఒక ఆవును కొనుగోలు చేసి ఖమ్మంలోని ఓ గోమాంసం విక్రయ దుకాణానికి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్సై తెలిపారు. రాజు, సతీష్‌ను అదుపులోకి తీసుకుని వాహనంతో ఆవులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

మహబూబాబాద్ రూరల్ : అక్రమంగా కోత కోసం తీసుకెళ్తున్న నాలుగు పశువులను పట్టుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. ఎండి.సద్దాం, గాడిపల్లి వెంకన్న రెండు ఆవులు, రెండు లేగ దూడలను పట్టణంలోని మూడు కోట్ల సెంటర్ నుంచి రజాలిపేటకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమీపంలో వారిని ఆపి విచారించారు. పశువులను కోత కోసం తీసుకెళ్తున్నట్లు వారు ఒప్పుకోగా వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, పశువులను నెల్లికుదురులోని గోశాలకు తరలించారు.

ప్రమాదకరంగా మలుపు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట నుంచి ఈదులపూసపల్లికి వెళ్లే రహదారిలో మూల మలుపుల వెంట తుమ్మ చెట్లు, భారీ వృక్షాలు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళ వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మూలమలుపులో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లు

భూకబ్జాలను ప్రోత్సహించిన కేసీఆర్ ప్రభుత్వం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

నెల్లికుదురు: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క నిరుపేదకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకపోగా ఎమ్మెల్యేలను ఆయా నియోజకవర్గాల్లో భూకబ్జాలకు కేసీఆర్ ప్రభుత్వం ప్రోత్సహించిందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆరోపించారు. మండలంలోని తారాసింగ బావితండా, నెల్లికుదురు మండల కేంద్రం, ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని అమూల్య గార్డెన్‌లో ఇందిరమ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు, మహిళా సంఘం మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానన్న ముఖ్యమంత్రి హామీతో నేడు మహిళా సంఘాల మహిళలకు రూ.1.75కోట్లు వడ్డీలేని రుణాలకు చెక్కు అందించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చందా నరేష్, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ పద్మ, అధికారులు, ఏఎంసీ డైరెక్టర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నెల్లికుదురు: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కేసముద్రం: పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శనివారం ఇనుగుర్తి మండల కేంద్రంలో చెట్లముప్పారం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్, మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు నీటిని పాలేరుకు తరలించొద్దు

గార్ల: గార్ల సమీపం నుంచి మున్నేరు నీటిని సీతారామ ప్రాజెక్ట్ కాలువలో కలిపి, పాలేరుకు తరలించే యోచనను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని అఖిలపక్షం నాయకులు శనివారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈమేరకు బహిరంగ లేఖ పత్రాలతో అఖిలపక్షం నాయకులు చేతబూని గార్లలోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలిపారు. ఇటీవల ఈ ప్రాంతంలోని మున్నేరు నీటిని పాలేరుకు తరలించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ జీఓ నంబర్ 98 విడుదల చేసి కాలువల నిర్మాణ పనులకు రూ.162కోట్లు మంజూరు చేయడం ఎంతవరకు సమంజసం అని నాయకులు ప్రభుత్వంపై మండిపట్టారు. మున్నేరు నీటిని కాల్వల ద్వారా పాలేరుకు తరలిస్తే అడ్డుకుంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జంపాల విశ్వ, కట్టెబోయిన శ్రీనివాస్, కందునూరి శ్రీనివాస్, సక్రు, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, మురళి, వెంకన్న, కత్తి సత్యంగౌడ్, తోడేటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మరిపెడ: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ మాలోతు సోమోజీనాయక్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి టీసీ, స్టడీ, కులము, ఆదాయము, నివాసము సర్టిఫికెట్లతోపాటు నాలుగు పాస్‌ఫొటో సైజు ఫొటోలతో కళాశాల పని వేళలో సంప్రదించాలని ఆయన కోరారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం స్టేషన్ నుండి కేసముద్రంవిలేజ్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా, ఆర్అండ్‌బీ శాఖ ఈఎన్‌సీ మోహన్‌నాయక్, ఈఈ బీమ్లా, ఎస్ఈ రాఘవరెడ్డి, డీఈ శ్రీకాంత్‌లు శనివారం స్థానిక అంబేడ్కర్ సెంటర్ పరిసరాలను పరిశీలించారు. ఈ మేరకు కల్వర్టును వారు పరిశీలించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

దోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ తెలిపారు. సీరోలు మండలం మోదుగ్గడ్డతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, బానోత్ రామునాయక్, ఆంగోత్ నాగేశ్వర్‌రావు, హుస్సేన్‌నాయక్, తేజ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లు

దంతాలపల్లి: మండలం దాట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సెల్ ఫోన్ సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఆ వ్యక్తి సెల్‌ఫోన్ వాట్సప్‌కు తప్పుడు లింకులు పంపి క్రమంగా డబ్బులు కాజేశారు. సదరు వ్యక్తి బ్యాంక్ ఖాతా తనిఖీ చేయగా డిసెంబర్ నుంచి ఈనెల వరకు రూ.90వేలు నష్టం చేసినట్లు తెలుస్తుంది. ఈవిషయంలో సదరు వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో షిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే సంతాపం

గూడూరు: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ట్రాక్టర్ డ్రైవర్ ఏదుల ఆదినారాయణ గుంటూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం ఆయన మృతదేహం గూడూరుకు చేరుకోగా, విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్ మండల కాంగ్రెస్ నాయకులతో కల్సి ఆదినారాయణ మృతికి పూలమాల వేసి, సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్, బీరం శ్రీపాల్‌రెడ్డి, రాసమల్ల యాకయ్య పాల్గొన్నారు.

గుడుంబాను నియంత్రించండి

కురవి: సీరోలు మండలం రేకుల తండాలో గుడుంబా విక్రయాలు, తయారీ అధికం అయిందని గుడుంబాను నియంత్రించాలని తండాకు చెందిన యువకులు ఇస్లావత్ నవీన్, తేజావత్ మహేష్, చింటూ, బాలు ఒక ప్రకటనలో శనివారం పేర్కొన్నారు.

నేడు ఖందిల్ ఉత్సవం

మహబూబాబాద్ రూరల్: సంప్రదాయం ప్రకారం బక్రీద్ పండుగ తెల్లవారురోజున ఖందిల్ ఊరేగింపు ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు: భూభారతి చట్టాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది వాసం ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని మట్టెవాడ గ్రామంలో శనివారం ఈసం రమేష్ అధ్యక్షతన గిరిజనులకు భూభారతి చట్టం, రెవెన్యూ సదస్సుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 11వ తేదీన మట్టెవాడలో నిర్వహించే సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిజ్జ పొట్టయ్య, రేగ వెంకటేశ్వర్లు, వాసం సమ్మయ్య, అజ్మీర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు యోగాపై అవగాహన

గూడూరు: మండలంలోని అయోధ్యపురం పీహెచ్‌లో శనివారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో ఆశవర్కర్లకు యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా యోగా శిక్షకుడు దోనపాటి శ్రీనివాస్‌గౌడ్ యోగాతో కలిగే ఉపయోగాలను వివరించారు. ఆశ వర్కర్లు గ్రామాలలో ప్రజలకు చేసే వైద్యసేవలతోపాటు యోగా విశిష్టతను వివరించాలన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైన ఘటనలో సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సదరు వివాహిత తమ బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పి కొద్దిరోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆమె మళ్లీ తిరిగి రాకపోవడంతో ఉండడంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్థికసాయం

గూడూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో హెచ్చు కృష్ణ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడ ఎల్లయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు చీదురు వెంకన్న 50 కేజీల బియ్యంతో పాటు నగదును అందించారు.

ప్రయాణికులు జాగ్రత్త వహించాలి

మహబూబాబాద్ రూరల్: రైలు ప్రయాణికులు తమ లగేజీ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆర్పీఎఫ్ ఏఎస్సై పి.దుర్గాప్రసాద్ అన్నారు. రైల్వే ప్రయాణికుల లగేజీ భద్రతపై శనివారం అవగాహన కల్పించారు.

అత్యాచారయత్నం.. ఇద్దరిపై కేసు నమోదు

నెల్లికుదురు: ఓ మహిళపై అత్యాచారయత్నం జరిగిన సంఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలం రూప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మధు తండాకు చెందిన గుగులోతు సురేష్, గుగులోతు వీరన్న అదే మండలం బక్కతండా జీపీ శివారు లక్ష్మాతండాకు చెందిన ఓ మహిళను ద్విచక్రవాహనంపైమండలంలోని మునిగలవీడు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి మహిళపై అత్యాచారయత్నం చేశారు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు సురేష్, వీరన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గూడూరు: మండలంలోని సీతానాగారం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2009–2010 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు ఘన సన్మానం చేశారు.